వుండేవారయితే, మీ తల వెంట్రుకలని ముందుకు దూసి, చెవుల మీదుగా వెనక్కి తీయండి. అప్పుడు మీరు సెలక్ట్ చేసుకున్న గ్లాసెస్ పెట్టుకుని చూడండి. ఈ స్టయిల్‌లో కనుక గ్లాసెస్ మీ ముఖానికి అందాన్నిస్తే, మీ జుట్టు ఏ స్టయిల్‌లో వున్నాగాని, అది మీకు సూటవుతాయి.

ఫ్రేమ్ సెలక్షన్‌లో ముఖ్యంగా మీ వెంట్రుకల రంగుకి ప్రాధాన్యత ఇవ్వాలి. మీ జుట్టు రాగి రంగులోనో లేక తెలిపోతున్నట్లుగానో వుండే ఫ్రేమ్ కాస్త ముదురు రంగులో వుండేట్లు సెలక్ట్ చేసుకోండి. అలాకాక, నల్లగా నిగనిగలాడే జుట్టయితే గోధుమ, బూడిద రంగులలోకాని, లేదా మరో సాదా రంగులోవున్న ఫ్రేమ్‌ని సెలక్ట్ చేసుకోండి.

ఎరుపు, ఆకుపచ్చ, నీలం వంటి రంగులతో వున్న ఫ్రేమ్‌లు, మెరుపులతో కూడిన ఫ్రేమ్‌లు కేవలం అలంకార ప్రాయంగా మాత్రమే ఉపయోగపడతాయి. కొంతకాలానికే ఇవి మూలన పడతాయి. ఏదైనా ఎక్కువ కాలం మన్నేట్లు తీసుకోవడం లాభదాయకం.

గ్లాసెస్ సెలక్షన్ కోసం మీకు కావల్సినంత సమయాన్ని తీసుకోండి. షాపతను ఏమైనా అనుకుంటాడేమోనన్న ఆలోచనని అసలు రానీకండి. మీ స్నేహితులు మీకు మంచి సలహాదారులని గుర్తుంచుకోండి. మేకప్‌తో పాటు, మీ సాధారణ హెయిర్‌స్టైల్‌తోనే సెలక్షన్‌కి వెళ్లాలన్న విషయం మరువకండి.

ఈ జాగ్రత్తలు తీసుకొని కొన్న గ్లాసెస్ మీ అందాన్ని ద్విగుణీకృతం చేయడమే కాదు. పదికాలాల పాటు మన్నుతాయి కూడా!

–నందం విష్ణువర్ధన్



మినీకథ




సాయిప్రభ

భర్తతోపాటు లోపలికి వస్తున్న రాధను చూడగానే సరిత ముఖం మాడిపోయింది.

రాధను చూడగానే ఎందుకలా ముఖం మాడ్చుకుంటావు నీ అబ్బ సొత్తేదో పోయినట్లు. ఇంటికి వచ్చే వాళ్ళను చిరునవ్వుతో ఆహ్వానించాలన్న జ్ఞానం కూడా లేని మొద్దు ముఖానివే భర్త ఈసడింపు.

సవతిని ఏ ఆడది చిరునవ్వుతో ఆహ్వానించదు. ఇంత చిన్న విషయం ఈయనకు తెలీదా?

అలా చింత మొద్దులా నిలబడక పోతే కాఫీ, టిఫిన్ పట్రావచ్చుగా. ప్రతీదీ చెప్పాలి.

మీకైతే ఇస్తాను. నా ఇంటికొచ్చి నామీదే పెత్తనం చెలాయించే ఈవిడకు నేనెందుకివ్వాలి ఇది సరిత మనసులో భావం. కానీ ఇది రోజూ ఉండేదే గనుక మారు మాట్లాడకుండా వంట గదివైపు వెళుతూ రాధను ఓరకంటితో చూసింది.

ఆమె పెదవులపైన చిరునవ్వు విరబూస్తోంది.

కబుర్లు చెప్పుకుంటూ కాఫీ, టిఫిన్ ముగించి ఇద్దరూ బయటకెళ్ళిపోయారు.

సరితకు ఏడుపు ముంచుకొచ్చింది. ఆవిడ భర్త చనిపోయి ఆవిడకు ఈ ఉద్యోగం రావడం తన పాలిట శాపమైంది. సానుభూతి అంటూ తన భర్త అక్కడికి వెళ్ళి పరామర్శించడం, ఆవిడగారు ఇక్కడికి రావడంతో క్రమంగా రాకపోకలెక్కువై సానుభూతి స్థానంలో సంసారం మొదలై తన జీవితాన్ని నాశనం చేస్తోంది. తను చదువులేనిదాన్నని, తనకెవరి అండలేదని మరీ విచ్చలవిడిగా తన కళ్ళముందే ప్రవర్తిస్తున్నారు. తన సుఖంకోసం సాటీ ఆడదానికి ద్రోహం చేస్తున్నామన్న భావం వీళ్ళకు ఉండదేమో. స్త్రీకి స్త్రీయే శత్రువంటారు. అది అక్షరాల నిజం.

భర్త పిలవడంతో ఆలోచనలనుండి తేరుకుంది. భర్త వెంట రాధ లేకపోవడంతో హమ్మయ్య అనుకుంది.

ఆ రాధను వదలేయమని ప్రాధేయ పడసాగింది సరిత.

రాధవల్ల నీకు ఇప్పుడు వచ్చిన కష్టమేమిటి ఇక్కడే ఉండి నిన్నేమన్నా రాచి రంపాన పెడుతోందా? లేదే. తనపాటికి తను వేరేగా ఉంటోంది కదా. ఈ కుళ్ళు సమాజంనుంచి తనను తాను కాపాడుకోడానికి ఓ తోడు కోరుకుంది. అది తప్పా?

ఆ తోడు మీరే ఎందుకు కావాలి?

ఆమెకు తోడుగా ఉంటున్నందుకు మనకు లాభమేగా, ఆమె డబ్బంతా మనకోసే ఖర్చుపెడుతోంది అంటూ విలాసంగా నవ్వుతున్న భర్తవైపు అసహ్యంగా చూస్తూ

డబ్బుకోసమే మీరు ఆవిడతో స్నేహం చేసేట్లయితే ఆ డబ్బు నేను సంపాదిస్తాను. ఆవిడ్ని వదిలేయండి.

చదువుకున్న వాళ్ళే ఉద్యోగాల్లేక అల్లాడుతుంటే అక్షరముక్క రాని నీకెవడిస్తాడు ఉద్యోగం అంటూ పగలబడి నవ్వసాగాడు.

ఒక్క క్షణం ఊరుకున్న సరిత నెమ్మదిగానే అయినా స్థిరంగా అంది. డబ్బు సంపాదించడానికి చదువు, ఉద్యోగమే అక్కరలేదు. నేను ఏ లాడ్జీకయినా పోయి సంపాదించి మీ కిస్తే...

మాట పూర్తి కాకముందే చెంప ఛెళ్ళు మనిపించి విసురుగా వెళ్ళిపోతున్న భర్తను చూసి కసిగా నవ్వుకుంది సరిత.

